

కబురు చేసే సిగరెట్టు ముట్టిస్తుంది. సింహబలుఁడు కొంచెం అవతల గడ్డం చేసుకుంటూ ఉంటాడు. ద్రౌపది ఉత్తరక్కూడా టీ తెచ్చి టీ పాయిమీద పెట్టి వెళ్లిపోతుంది.

సింహ:—అక్కయ్యా ఈ అమ్మాయి ఎవరూ?

సుదేష్ణ:—ఎవరో నాకూ తెలియదు. ఓ ఏడాది మాయింట్లో ఉంటానంటే ఉండమన్నాను.

ఉత్తర:—సంగీతం బాగా వొచ్చునుకుంటా మామయ్యా మా బృహన్నలగారు చెప్పారు.

సింహ:—ఊహుఁ—ఆ పేడిమూతి వాడికి ఎల్లా తెలుసూ?

సుదేష్ణ:—అల్లా అనకూడదు పరాయివాళ్లని,

సింహ:—అక్కయ్యా. ఆ అమ్మాయిని చూస్తే—రకంవారీగానే ఉన్నది!

సుదేష్ణ:—అప్పుడే నీ కన్ను బడ్డదే—యిక బాగుపడవు.

సింహ:—అది కాదు అక్కయ్యా—మొన్న మన వూళ్లో ఎవరో అన్నారు. "అయిదుగురు భర్తలట—ఎంత కాముకి" అని.

సుదేష్ణ:—అంతా ఉత్తది.

సింహ:—అవును గాని—చెబితే నమ్మతావో నమ్మవో అక్కయ్యా. ఆ అమ్మాయికోసం నా ఎదురురొమ్ము కొట్టుకుంటూంది,

సుదేష్ణ:—ఛీ తప్పు—అల్లా అనకూడదు.

సింహ:—అల్లాకాదక్కయ్యా—ఆవిడ కళ్లుచూశావూ?—ఏమోకాని అక్కయ్యా—నాకు మటుక్కు ఆవిడంటే సుగంధంతో కూడుకొన్న టీవలె ఉంటుంది.

సుదేష్ణ:—యిటువంటి మాటలు చెప్పకు.

ఉత్తర:—మామయ్య రసోన్మత్తుడు.

సింహ:—అక్కా చనువు కనుక నీతో చెప్తున్నాను ఆ అమ్మాయిని యీ రాత్రి మా యింటికి పంపకపోతే యీ కత్తి పెట్టుకు పీక కోసుకుంటాను—నిజం!

సుదేష్ణ:—అఘాయిత్యం మాటలు చెప్పకు.

సింహ:—నిజమక్కయ్యా. నిజం ముమ్మాటికీ నిజం!

సుదేష్ణ:—నీకు సుదేష్ణవంటిది. తప్పు! అల్లా అనకూడదు.

సింహ:—అక్కా నీకేమన్నా పిచ్చా. వెర్రి పోలికలు చెప్తావేమిటీ. నా మాటకు ఒప్పకోకపోతే—యిప్పుడు నీ రెండుకళ్ల ఎదటా యిప్పుడే కోసుకుంటాను—ఇదుగో!

సుదేష్ణ:—ఏమిట్రా గందరగోళం!

ఉత్తర:—మామయ్యా! సిగరెట్టు కావాలా?